ప్రజాశక్తి

గురువారం 4 ఏప్రిల్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

విల 'పింఛన్'



చీరాలలో పింఛను కోసం బారులు తీరిన వృద్ధులు

- పింఛను కోసం సచివాలయాల వద్ద క్యూకట్టిన వృద్ధులు
- మధ్యాహ్నం వరకూ పడిగాపులు
- మండుటెండలో అవస్థలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పింఛన్ల కోసం వద్ధులు, వికలాంగులు, వితంతువులు సచివాలయాల వద్ద ఉదయానే క్యూ కట్టారు. ఫించను సొమ్ములు బ్యాంకుల నుంచి రాకపోవడంతో సాయంత్రం 4 గంటల వరకూ పడిగాపులు కాశారు. ఎట్టకేలకు సాయంత్రం నుంచి పింఛన్లు పంపిణీని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి పింఛన్ల పంపిణీ చేపట్టడంతో సర్వర్ పనిచేయలేదు. ఫలితంగా పింఛన్ల పంపిణీలో జాప్యం నెలకొంది. సర్వర్లు పనిచేయక లబ్ధిదారుల వేలిముద్రలు పడక పోవడంతో కొన్ని చోట్ల ఫేస్ స్కాన్ ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సెక్రటరీల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పండు వద్ధులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగులకు సచివాలయ సెక్రటరీల ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ ఆది ఆచరణకు నోచలేదు. సంతమాగులూరు, వేమూరు, భట్టిప్రోలు, బాపట్ల తదితర ప్రాంతాల్లో పింఛన్ల కోసం లబ్ధిదారులు అవస్థలు పడ్డారు.

భట్టిప్రోలు : పింఛన్ల కోసం వృద్ధులకు సచివాలయాల వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. బ్యాంకు నుంచి నగదు అందకపోవటంతో సాయంత్రం వరకూ సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన టెంట్ల కింద వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో బ్యాంకు నుండి నగదు తీసుకురావడంతో యుద్ధప్రాతి పదికన ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పెన్సన్ పంపిణీ చేశారు.

వేమూరు : చుండూరు మండలంలోని సచివాలయాల వద్ద వద్ధులు, వితంతువులు, వికలాంగులు పెన్షన్ కోసం ఎదురు చూపులు చూశారు. చివరకూ మధ్యాహ్న సమయంలో పింఛన్లు అందజేశారు.

చీరాల : వద్ధులు,వికలాంగులు పింఛన్ల కోసం సచివాలయాల బాట పట్టారు. పట్టణం లోని వైకుంటపురం సచివాలయల వద్ద వద్ధులు పించల కోసం బారులు తీరారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేశారు. పండు వద్ధులకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించినప్పటికీ కొన్ని సచివాలయాలలో సెక్రటరీలు పట్టించుకోలేదు. దీంతో పండు వద్ధులు, వికలాంగులు చేసేదేమీ లేక సచివాలయాల వద్ద బారులు తీరిన క్యూలో ఉండి ఇబ్బందులు పడ్డారు. పింఛన్ల పంపిణీ తీరును మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి పరిశీలించి వద్ధులకు పింఛన్లు అందజేశారు.

యర్రగొండపాలెం : పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు సచివాలయాల వద్ద ఉదయానే బారులు తీరారు. సాయంత్రం వరకూ పింఛన్లు పంపిణీ చేయక పోవడంతో వారు అనేక ఇబ్బందులకు గురయ్యారు. వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడ్డారు.

సిఎస్ పురంరూరల్ : పింఛను తీసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దనే పింఛను తీసుకుంటున్న వద్ధులు ఈనెలో రెండో తేదీ వరకూ పింఛన్లు ఇవ్వకపోవడంతో ఇస్తారో, లేదోనని ఆందోళన చెందారు. బుధవారం నుంచి సచివాలయం వద్ద పింఛను ఇస్తారని తెలియడంతోఉదయం 9 గంటలకే సచివాలయాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం తర్వాత పింఛన్ ఇస్తామని సచివాలయ సిబ్బంది తెలపడంతో వద్ధులు ఉసూరు మంటూ ఇళ్లకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి సచివాలయాల వద్దకు వచ్చి పింఛను నగదు తీసుకున్నారు.

కొండపి : పింఛన్లు కోసం లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పింఛను కోసం మండుటెండలోనే వద్ధులకు సచివాలయాలకు వద్దకు వచ్చారు. దీంతో అనేక ఇబ్బందులకు గురయ్యారు.



కొండపిలో ఎండలో వృద్ధుల అవస్థలు



సిఎస్‌పురంలో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు



భట్టిప్రోలులో పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు

ఎన్నికల్లో వివాదాస్పదంగా మారుతోన్న ఎస్‌పిల పాత్ర

- గత ఎన్నికల్లోనూ హఠాత్తుగా జిల్లా ఎస్‌పి కోయిప్రవీణ్ బదిలీ
- ఇపుడు ఎస్‌పి పరమేశ్వరరెడ్డిపై ఇసి వేటు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఎన్నికల్లో పోలీసుల పాత్ర వివాదాస్పదంగా మారుతోంది. ఎవరు అధికారంలో ఉంటే ఆపార్టీకి కొమ్ము కాయడం విమర్శలకు తావిస్తోంది. ఇపుడు ఆకస్మికంగా జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డిపై ఇసి వేటు వేసింది. ఎన్నికల విధుల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో ముగ్గురు అధికారులతో ప్యానల్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని నిర్దేశించింది. ఇదంతా నిబంధనల ప్రకారం జరిగిపోతుంది. ఎన్నికల సమయానికి ఐఎఎస్, ఐపిఎస్‌ల బదిలీలు జరుగుతుంటాయి. ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉండే అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించుకుంటుంది. ముందుగా వారితో సంప్రదింపులు చేసి తమకు అన్నివిధాలా సహకరించేవారినే ఎస్‌సిలుగా నియమిస్తారు. ఇపుడూ ఇదే జరిగిందనే చర్చ సాగుతోంది. ఫిర్యాదుల ఆధారంగా ఇసి వేటు వేయడం కూడా యాదృశ్చకమే. ఎన్నికల్లో పాలక పక్షానికి సహకరించారనే ఆరోపణల పైనా, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి



కారణాలతో ఇసి వేటు వేసింది.ప్రధాని మోడీ పాల్గొన్న సభకు సంబంధించి ట్రాఫిక్ నిర్వహణలోనూ వైఫల్యాలపై టిడిపి,బిజెపి, జనసేన నేతలు ఇసికి ఫిర్యాదు చేశారు. చెక్ పోస్టులను సరిపడా పెట్టకుండా నిర్లక్ష్యంగా ఉన్నారనే ఆరోపణలూ ఆయనపై వచ్చాయి. తనిఖీల విషయంలోనూ పక్షపాతం ప్రదర్శించారనే విమర్శలూ వచ్చాయి. వీటన్నిటిపై విచారణ జరిపిన ఇసి హఠాత్తుగా ఎస్‌పిని పక్కన బెట్టేసింది. ఎస్‌పి స్థాయి అధికారులే పోలీసుశాఖ మొతాన్ని నడిపిస్తారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉండగా కొందరు అధికారులు మాత్రం పాలకపక్షానికి కొమ్ముకాయడం అనివార్యమైంది. అందుకు ఎలాంటి ప్రలోభాలు తెరచాటు ఉంటాయో అంతు చిక్కడం లేదు. జిల్లా ఎస్‌పిగా పరమేశ్వరరెడ్డి నియామకం ప్రారంభంలోనే వివాదా స్పదంగా మారింది. ఈయన నియామకం తనకు తెలియదని మాజీ మంత్రి బాలినేని కూడా పార్టీ నేతల వద్ద ప్రస్తావించారు. పార్టీ కో ఆర్డినేటర్‌గా చెవిరెడ్డిని నియమించాక ఆఘ మేఘాలపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని జిల్లా ఎస్‌పిగా తెచ్చుకున్నారనే చర్చ కూడా ఉంది. చెవిరెడ్డి కూడా బాలినేనితో ఎన్నికల్లో మనకు అన్ని విధాలా సహకరిస్తారని నచ్చజెప్పి ఎస్‌పి రాకకు అన్నిఅడ్డంకులు తొలగిపోయేలా చేశారు. ఇదంతా బహిరంగ రహస్యమే. ఎన్నికల కోసమే పరమేశ్వరరెడ్డిని తెచ్చు కున్నారని టిడిపి నేతలు భావించారు.ఆయన ఇక్కడ ఉంటే ఎన్నికల్లో నష్టపోతాయనే అంచనాకు వచ్చారు. గత ఎన్నికల్లోనూ ఇదే తరహాలోనే అప్పటి ఎస్‌పి కోయ ప్రవీణ్‌పై వైసిపి నేతలు ఇసికి ఫిర్యాదు చేసి బదిలీ చేయించారు. ఇదే తరహాలో ఇపుడు టిడిపి కూటమి నేతలు ఇసికి ఫిర్యాదు చేసి బదిలీ చేయించారనే చర్చ సాగుతోంది. ఎన్నికల్లో ఇలా ఎస్‌పిలను బదిలీలు చేయడం ప్రజల్లో చర్చకు తావిస్తోంది. ఎన్నికల సమయాల్లో ఉన్నతాధికారుల పాత్రపైనే చర్చ

▶ 2లో



సంతమాగులూరులో రాజీనామా పత్రాలు చూపుతున్న వాలంటీర్లు

వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామా

- సంతమాగులూరులో వందమంది
- మోదుకూరు, మండూరులో పలువురు రాజీనామా

ప్రజాశక్తి - సంతమాగులూరు

సంతమాగులూరు మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని 100 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ తాము ప్రజలకు సేవ చేస్తుంటే తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నాయని పేర్కొన్నారు. అవ్వా, తాతలకు పెన్షన్లు ఇవ్వకుండా తమను అడ్డుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. తమ వద్ద నుంచి మొబైల్స్, సిమ్స్, డివైసులు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో మనస్థాపం చెంది తాము రాజీనామాలు చేసినట్లు తెలిపారు. వైసిపి అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డికి తమ సంఘీభావం తెలిపారు.

వేమూరు : చుండూరు మండలం మోదుకూరు, మండూరు గ్రామాలకు చెందిన వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒలకు అందజేశారు. పెన్షన్ల పంపిణీకి ప్రతిపక్ష పార్టీల ఆరోపణలతో ఎన్నికల కమిషన్ తమను దూరం చేయడంతో మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. హనుమంతునిపాడు మండల పరిధిలోని నందనవనం వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న బత్తుల రంగ నాయకులు రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి రమణయ్యకు తన రాజీనామా లేఖను అందజేశాడు.

వెలిగండ్ల హైస్కూల్‌కు రూ.లక్ష విరాళం



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్

అధికారుల నిర్లక్ష్యంతో ముదురుతున్న
దళితవాడ కాలువ సమస్య

ప్రజాశక్తి-త్రిపురాంతకం

అధికారుల జాప్యంతో త్రిపురాంతకం మండలంలోని ఎండూరువారిపాలెం దళితవాడ కాలువ సమస్య రోజురోజుకూ ముదురుతోందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్, సిపిఐ యర్రగొండపాలెం నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దళితులను ఓటు వేయనిస్తారో లేదోనని వ్యక్తం చేశారు. బుధవారం త్రిపురాంకతంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎండూరువారిపాలెం గ్రామ దళితుడైన త్రిపురాంజనేయులు మీద అగ్రకులాలు దాడి చేసి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అనంతరం బాధితుడైన త్రిపురాంజనేయులుపైనే కౌంటర్ కేసుపెట్టి భయభ్రాంతులకు గురి చేశారు. ఈ విషయం ఇలా ఉంటే కాలువ సమస్య తేల్చకుండా అధికారులు జాప్యం చేస్తున్న కారణంగానే రోజురోజుకూ ఆ గ్రామంలో ఆధిపత్య కులాల హెచ్చరికలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని ఆరోపించారు. రాజకీయ ప్రలోభాలతోనే అధికారులు దళితవాడ కాలువ సమస్య పరిష్కరించలేక పోయారని ఆరోపించారు. అధికారులు మాత్రం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. దళితులు సామాజిక బహిష్కరణకు గురి కాకముందే అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్షంగా ఆందోళనకు దిగి సమస్య పరిష్కరించుకుంటామని హెచ్చరించారు. ఇదే పెత్తందారి హెచ్చరికలు కొనసాగితే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దళితులు స్వతంత్రంగా ఓట్లు వేసుకునే పరిస్థితి కూడా ఉండదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఎండూరువారిపాలెం గ్రామ దళితవాడ సమస్య పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బాణాల రామయ్య, దళిత నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వెలిగండ్ల

కనిగిరి మండలం పాతపాడు గ్రామానికి చెందిన మార్తాల శ్రీనాథ్‌రెడ్డి వెలిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బుధవారం లక్ష రూపాయలు విరాళం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అందజేశారు. 50 వేల రూపాయలు ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మరో 50 వేల రూపాయలతో పాఠశాలకు అవసరమైన ప్రింటర్, స్కూల్ బెల్స్, కుర్చీలు సమకూర్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు మాట్లాడుతూ చదువు విలువ తెలిసిన ఎన్ఆర్ఐ మార్తాల శ్రీనాథ్‌రెడ్డి ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు రావడం, అందుకు వెలిగండ్ల హైస్కూల్‌ను ఎంపిక చేసుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. దాత శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులుపడే కొంతమందికైనా చేయూత నివ్వాలనే తలంపుతోనే ఈ సహాయం చేస్తున్నట్లు చెప్పారు. మార్తాల శ్రీనాథ్‌రెడ్డిని



విరాళం అందజేస్తున్న ఎన్నారై శ్రీనాథ్‌రెడ్డి

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల మండల విద్యాశాఖాధికారి దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడారు. అనంతరం 10 మంది విద్యార్థుల కు నగదు పురస్కారాలు అందజేశారు. స్కూలుకు ప్రింటర్, స్కూల్ బెల్స్, కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్వరలో వైద్య పరికరాలు అందిస్తాం

డాక్టర్ రఘునందన్ ● జిజిహెచ్‌ను పరిశీలించిన డిఎంఇ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, వైద్య కళాశాలకు అవసరమైన పరికరాలు త్వరలో అందిస్తామని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రఘునందన్ తెలిపారు. బుధవారం ఒంగోలు వచ్చిన ఆయన జిజిహెచ్, వైద్య కళాశాలలోని వివిధ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. మొదట జి జి హెచ్ సందర్శించిన ఆయనకు సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్, ఆర్ఎంఒ డాక్టర్ హనుమంత రావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభా స్కాన్ అండ్ షేర్ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో వైద్య కళాశాల అన్ని రకాల రిపోర్ట్స్ ను ఈ-ఫైల్ చెయ్యాలని సూచించారు. అనంతం సెంట్రల్ ల్యాబ్, ఐసియు విభాగం, మెడికల్ రికార్డ్స్ విభాగాలను పరిశీలించారు. 10 సంవత్సరాలు దాటిన రికార్డ్స్ స్కాన్ చేసి వాటిని ఎలా డిస్మేండల్ చేయాలో ఆర్ఎంఒకు సూచించారు. అనంతరం వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్ లో విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా కావాల్సిన వైద్య పరికరాల జాబితాను అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాల స్వరూపం, కావాల్సిన సౌకర్యాలను ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ఏడుకొండల రావు వివరించారు. సమావశంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రావు, డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ సుధాకర్ బాబు, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ చైతన్య వర్మ పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: రాష్ట్రాభివృద్ధి జగనన్న పాలనలోనే సాధ్యమని యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన మండలంలోని తుమ్మలబయలు, చిన్నారుట్ల గిరిజన గూడేల్లో, సాయంత్రం చిన్న దోర్నాల, చిన్నగుడిపాడు గ్రామాల్లో మన ఊరు మన చంద్రశేఖరన్న కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో గిరిజనులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.

ఎన్నికల్లో వివాదాస్పదంగా
మారుతున్న ఎస్‌పిల పాత్ర


(మొదటిపేజీ తరువాయి)

సాగుతోంది. ముఖ్యంగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎస్‌పి, కలెక్టర్ స్థాయి అధికారులు దారితప్పడమే విడ్డూరంగా ఉంది. ఆ స్థాయి అధికారులను విధుల నిర్వహణలో సరిగా లేరని పక్కన బెట్టడం కూడా ఆ శాఖ ప్రతిష్టకూ భంగం కలిగేలా కనిపిస్తోంది. పోలీసుశాఖ దిగువ స్థాయి అధికారుల్లోనూ ఈ బదిలీ విస్మయం కలిగిస్తోంది. ఉన్నతాధికారుల తీరే ఇలా ఉంటే దిగువకు ఎలాంటి ఆదేశాలు వెళతాయన్నదే సందేహంగా మారింది. ఇక పాలకపక్షంలోనూ ఇపుడు అంతర్మథనం మొదలైంది. తాము ఏరికోరి తెచ్చుకున్న ఎస్‌పిపై వేటు వేయడం పాలక పక్షనేతలకూ మింగుడు పడలేదు. గత ఎన్నికల్లో ఇసి వైసిపికి అండగా ఉంటే ఇపుడు కూటమికి అండగా ఉందనే చర్చ కూడా నడుస్తోంది. ఏదేమైనా ఉన్నతాధికారులు ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన అవసరముంది.

80 శాతం పోలింగ్ నమోదు కావాలి: కలెక్టర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లా కేంద్రమైన ఒంగోలుకు 190 కిలోమీటర్ల దూరంలోని నల్లమల అటవీ ప్రాంతంలో నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఉన్న యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్ర పరిధిలోని పాలుట్ల గిరిజన గూడేన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడి ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి సౌకర్యాల పట్ల ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఓటు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని, దానిని వినియోగించుకోవలసిన బాధ్యత కూడా ఓటర్లపై ఉన్నదని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుకే తనతోపాటు ఎన్నికలకు సంబంధించిన అధికారులు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో పేరు ఉండి, వలస వెళ్లిన వారందరినీ కూడా ఎన్నికల సమయానికి వచ్చేలా చూడాలని ఆయా కుటుంబ సభ్యులకు సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ఓటర్ల చేత కలెక్టర్ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఓటు ఆవశ్యకతను తెలిపేలా స్వీప్ నోడల్ అధికారులు రూపొందించిన పోస్టర్లను స్థానికుల ఇళ్లకు అతికించి ఓటర్లలో స్ఫూర్తిని నింపారు. వచ్చే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలోని మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాల్లో ఇక్కడ ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రమే క్రమ సంఖ్య పరంగా మొదటి స్థానం దక్కించుకుందని తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్నందున ఈ గ్రామస్తులకు విద్యుత్, నీటి సౌకర్యాన్ని సోలార్ పవర్ సిస్టం, బోర్‌వెల్స్ ద్వారా ప్రభుత్వ యంత్రాంగం కల్పిస్తున్నదని పేర్కొన్నారు. సుమారు 3,000 మంది జనాభా ఉన్న ఇక్కడ ఓటర్లు 961 మంది ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ 70 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కనీసం 80 శాతం నమోదయ్యేలా చూడాలని అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. తద్వారా మారుమూల గ్రామమైనప్పటికీ ఇతర గ్రామాలకు ఇది ఆదర్శంగా నిలిచిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీడీపీటీ (మార్కాపురం) జి విఘ్నేష్ అపావ్, సబ్ డీఎఫ్ఓ ఏ వేణు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, జిల్లా స్వీప్ నోడల్ అధికారులు జ్యోతి, బి రవి, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీలేఖ, డీఎల్‌డీఓ సాయి కుమార్, తహశీల్దార్ సోమా నాయక్, ఐటిడిఏ స్పెషల్ ఆఫీసర్ కె నాగేశ్వరరావుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



చెంచులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

రామసుబ్బమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ప్రకాశం జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు, వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి మాతృమూర్తి గుంటక రామ సుబ్బమ్మ(80) మంగళవారం హైదరాబాదులో మృతి చెందారు. ఆమె స్వగ్రామం వెదుళ్లచెరువులో బుధవారం సాయంత్రం దహన సంస్కారాలు నిర్వహించారు. జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి తల్లి మరణ వార్త తెలుసుకున్న జడ్‌పి చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ దర్శి నియోజకవర్గ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వెదుళ్లచెరువులోని ఆమె స్వగృహంలో భౌతిక కాయానికి నివాళు లర్పించి గుంటక తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమె మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డికి తోడ బుట్టిన అక్క. నియోజకవర్గంలోని ప్రముఖులు, కనిగిరి వైసీపీ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, మాజీ జడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, దేవసహాయం, ఎలిక రమణయ్య, నాగూర్ యాదవ్, పిడిసిసి బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్పర్సన్ పులి శాంతి, జడ్పీటీసీలు దంతులూరి ప్రకాశం, మడతల కస్తూరిరెడ్డి, ఓకే రెడ్డి మండలంలోని వైసిపి మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ పోలా సుబ్రహ్మణ్యం, మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.



రామసుబ్బమ్మకు నివాళి అర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

ఏఎంసీ మాజీ చైర్మన్ కోటా నరసింహులు మృతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ కోటా నరసింహులు మృతి చెందారు. బుధవారం సాయంత్రం తన స్వగ్రామం గిద్దలూరు మండలం తిమ్మాపురం గ్రామంలో వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో గిద్దలూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. కోటా నరసింహులు రెండుసార్లు తిమ్మాపురం గ్రామపంచాయతీ సర్పంచ్, గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల చైర్మన్, గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ పదవులు అలంకరించి ఉన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో రాజకీయ రంగంలో ప్రముఖ పాత్ర పోషించిన వ్యక్తి కోటా తెలుగుదేశం పార్టీ, ప్రజారాజ్యంపార్టీ, వైసిపిల్లో క్రియాశీలక పాత్రలు పోషించి ఉన్నారు. ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. కోటా నరసింహులు మరణవార్త విని గిద్దలూరు నియోజకవర్గం రాజకీయ నాయకులందరూ ఒక మంచి నాయకున్ని పోగొట్టుకున్న బాధను వ్యక్తపరిచారు. కోటా నరసింహులు అంత్యక్రియలు గురువారం తిమ్మాపురం గ్రామంలో జరగనున్నాయి.



భాగ్యనగర్‌లో దామచర్ల ప్రచారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని 20వ డివిజన్ భాగ్యనగర్‌లో జనం కోసం జనార్ధన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు ఇంటింటికీ వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు మాగుంట రాఘవ రెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియా జ్, బిజెపి నాయకుడు యానం చిన్న యోగయ్య యాదవ్, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి, కామేపల్లి శ్రీనివాసరావు, టిడిపి నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు, బండారు మాధన్, జూటూరి కష్ణ, డివిజన్ అధ్యక్షుడు బోయపాటి హరిబాబు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు మలగా రమేష్, కేశన శేషమ్మ, నల్లూరి అశోక్, తన్నీరు వాసు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

ప్రజాశక్తి-దర్శి

పెన్షన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో వాలంటీర్ల ద్వారా ఒకటో తారీఖున పెన్షన్లు ఇచ్చే విధానాన్ని కాకుండా సచివాలయం వద్ద బుధవారం పెన్షన్లు ఇచ్చారు. ఒకటో సచివాలయం వద్ద కాకుండా మున్సిపల్ కార్యాలయం వద్ద పెన్షన్లు బుధవారం సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. మొత్తం 624 పెన్షన్లు ఉంటే ఒక్కరోజే 200 పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నేటి బహిరంగ సభను జయప్రదం చేయండి: కడియాల

ప్రజాశక్తి-దర్శి: నేడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను దర్శి గడియార స్తంభం సెంటర్లో జయప్రదం చేయాలని కడియాల లలితసాగర్ అన్నారు. స్థానిక పిటిఎస్ కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని నాయకులతో, కార్యకర్తలతో బుధవారం ఆయన మాట్లాడారు. సాయంత్రం మూడు గంటలకు ముండ్లమూరు మండలం శంకరా పురం నుంచి కార్లతో భారీ ర్యాలీగా వచ్చి పులిపాడి వద్ద శివాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అక్కడ నుంచి దర్శి గడియార స్తంభం సెంటర్ వరకు భారీగా మోటార్ సైకిల్ ర్యాలీ జరుగుతుందని అన్నారు. గడియార స్తంభం సెంటర్లో సాయంత్రం భారీ బహిరంగసభ జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండరాదు: కలెక్టర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యాబుద్ధులు నేర్పకుండా విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీచర్లపై జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పాలుట్ల గ్రామంలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అక్కడి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పుస్తకాలలోని ప్రశ్నలు అడిగి వారి ప్రతిభా స్థాయిని పరీక్షించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సరైన సమాధానం చెప్పలేకపోవడంతో వారి తరగతులకు తగిన విధంగా ఎందుకు బోధించలేకపోతున్నారని టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఇక్కడే ఉండాల్సిన టీచర్లు ఉండటం లేదని, పాఠశాలకు కూడా రావడం లేదని, వారి స్థానంలో అర్హత లేని ఇతరులతో పాఠాలు చెప్పిస్తున్నారని వారు వివరించారు. దీనితో సంబంధిత టీచర్లపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. పరిస్థితిని పర్యవేక్షించకుండా ఏమి చేస్తున్నావని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిపైనా కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకొని పరిస్థితిని చక్కదిద్దుతామని స్థానికులకు కలెక్టరు భరోసా ఇచ్చారు. రీ వెరిఫికేషన్ పేరుతో తమ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అటవీశాఖ అధికారులు తీసుకున్నారని, నాలుగు నెలలైనా తమకు తిరిగి ఇవ్వకపోవడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల లబ్ధి కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని గిరిజనులు చెప్పారు. దీనిపై కలెక్టరు స్పందిస్తూ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి ఈ నెల ఆరో తేదీ నాటికి పట్టాలను తిరిగి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీడీపీటీ (మార్కాపురం) జి విఘ్నేష్ అపావ్, సబ్ డీఎఫ్ఓ ఏ వేణు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, డీఎల్‌డీఓ సాయికుమార్, తహశీల్దారు సోమానాయక్, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

పొగాకు కిలో అత్యధిక ధర రూ.232

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి బుధవారం మండలంలోని పేర్నమిట్ట గ్రామ రైతులు వేలం కేంద్రానికి 696 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 631 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 65 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.232 పలుకగా అత్యల్ప ధర రూ.220 పలికింది. సరాసరి కిలో ధర రూ.229.58 పలికింది. వేలంలో 20 కంపెనీలు పాల్గొన్నాయి. వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ వేలాన్ని నిర్వహించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చీరాల

ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఈపురిపాలెం ఎస్ఐ శివకుమార్ అన్నారు. బుధవారం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా గవినివారిపాలెం గ్రామ పొలంలో పోలీసులు కవాతు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల సబ్ డివిజన్ డిఎస్పీ బి ప్రసాద్, చీరాల రూరల్ సర్కిల్ సిఐ ఎన్ సత్యనారాయణ ఉత్తర్వులు మేరకు చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం వెంకట శివకుమార్ సిబ్బంది కేంద్ర బలగాలతో గ్రామంలోనూ వాహనాలు తనిఖీలు చేసి పెట్రోలింగ్‌తో ఫ్లాగ్ మార్చి చేశారు. ఎలక్షన్లలో ప్రజలు నిర్భయంగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకోవలసిందిగాని ప్రజలకు తెలియజేశారు.



మెటీరియల్‌ను అందిస్తున్న అట్లూరి రామారావు

విద్యార్థులకు మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎండ్లూరు ఎంపియుపి పాఠశాల పూర్వ విద్యార్థి అట్లూరి రామారావు ఆ పాఠశాల 6,7,8 తరగతుల విద్యార్థులకు పరీక్షా రాత మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అట్లూరి రామారావు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయు నిగా, బహుజన ఉద్యోగుల సంఘ సేవకునిగా పనిచేయుచున్నానని, తాను 60 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పాఠశాలలో 6,7,8 తరగతులకు చెందిన 45 మంది విద్యార్థులకు పరీక్ష రాత మెటిరీయల్‌ను అందించానన్నారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శేషిరెడ్డి అధ్యక్షత వహించగా, సీనియర్ ఉపాధ్యాయిని ఎం భాగ్యమ్మ, బహుజన ఉద్యోగుల నాయకులు ఇట్లా వెంకటేశ్వర్లు, తెలుగు పండిట్ జే మేరిమ్మ, అంగన్‌వాడీ టీచర్ కే పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం పట్టణనికి చెందిన టీడీపీ నాయకులు గిద్దలూరు నియోజకవర్గంలో వైసీపీ గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి, తమ్ముడు కేపీ కృష్ణ మోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీకి చెందిన పంచాయతీ మెంబర్ షేక్ ఇబ్రహీం మరియు కోనేటి వీధి చెందిన టీడీపీ యువ కార్యకర్త షేక్ అబ్దుల్ రెహమాన్, వారి కుటుంబ సభ్యులు టీడీపీని విడి వైసీపీలో చేరారు. వారికి వైసీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో వైసీపీ విజయానికి అన్ని రంగాల నుంచి కృషి చేయాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలిపారు.

ఎన్‌సిసి అధికారిగా గోపీనాథ్

ప్రజాశక్తి-చీరాల

గుంటూరు 23 ఎన్సిసి బెటాలియన్ నుంచి 3వ ఎన్‌సిసి అధికారిగా గొర్ల గోపీనాథ్ ఎంపిక అవటం అభినందనీయమని సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ జీనా జెవిఆర్ అన్నారు. బుధవారం స్థానిక స్కూల్లో గోపీనాథ్‌కు అభినందన సభ నిర్వహించారు. క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి అన్నారు.

చందలూరికి సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి



నారాయణరావు

శ్రీ కోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా గుంటూరులోని "అమరావతి సాహితీ మిత్రులు"సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఉగాది వేడుకల్లో భాగంగా 9మందిని ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు తెలిపారు. ఈ పురస్కారాలను మే 7న గుంటూరులో జరిగే ఉగాది వేడుకల్లో అందచేయ నున్నట్లు తెలిపారు. వీరిలో అద్దంకి పట్టణానికి చెందిన వచన కవి, సాహితీ స్రవంతి అధ్యక్షులు చందలూరి నారాయణరావు ఎంపికయ్యారు. ఆయన ధర్మవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. గతంలో ఆయన రాసిన "మనం కాసేపు మాట్లాడుకుందాం (2018), మనిషి గుర్తుల్ని బతికించు కుందా" (2022) అనే కవితా సంపుటిలతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు ఆయన రాసిన 975 కవితలు వివిధ పత్రికల్లో ప్రచురితం కావడం విశేషం. ఈ సందర్భంగా ఆర్‌వి రాఘవరావు, అన్నమనేని వెంకట్రావు, గాడేపల్లి దివాకరదత్తు, డివిఎం సత్యనారాయణ, మిట్టా కామేశ్వరశర్మ, ఇలపావులూరి శేషతల్పసాయి, మోటుపల్లి రాందాసు, బాలు, బి ఆంజయ్య , జి శేషగిరి అభినందనలు తెలిపారు.



టిడిపి కార్యకర్తలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

టిడిపి కార్యకర్తలతో సమావేశం

ప్రజాశక్తి -యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లి, అనంతవరం, చింతపల్లిపాడు, యనమదల, యద్దనపూడి, వింజనంపాడు, పోలూరి, జాగర్లమూడి, తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం, గన్నవరం, చీమటావారిపాలెం, పూనూరు గ్రామాల టిడిపి కార్యకర్తలతో ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో టిడిపి నాయకులు సీతయ్య, నాగేశ్వరరావు, హరిబాబు, వెంకటస్వామి, సుబ్బారావు, తారక, జె వెంకటేశ్వర్లు, బాబు, బి సాంబశివరావు పాల్గొన్నారు.



అశోక్ బాబుకు మద్దతుగా ప్రచారంలో ప్రజాప్రతినిధులు

వైసిపి అభ్యర్థి కోసం ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబుకు మద్దుతగా భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయనకు మద్దతుగా ఆయన సతీమణి వరలక్ష్మితోపాటు ఎంపీపీ డివి లలిత కుమారి, జెడ్పిటిసి తిరువీధుల ఉదయ్ భాస్కరి, సర్పంచ్ ధారా రవికిరణ్మయి, పలువురు ఎంపీటీసీలు, క్లస్టర్ ఇంచార్జీలు, బూత్ ఇన్చార్జులు పాల్గొన్నారు. అశోక్ బాబు తన ప్రచారాన్ని అమర్తలూరు, చుండూరు మండలాల్లో కొనసాగించారు. నాగమల్లేశ్వరరావు, బాలాజీ, పిచ్చయ్య శాస్త్రి, రెహమాన్, సిరాజుదిన్, కర్రెంశెట్టి బాలు పాల్గొన్నారు.

గుదేటి విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి - వేమూరు

టిడిపి చుండూరు అధ్యక్షులుగా పనిచేసిన గుదేటి బ్రహ్మారెడ్డి జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసుకొన్న విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారు జామున తగులబెట్టారు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు చుండూరు ఎస్ఐ తెలిపారు. ఎవరి మీద ఎవరు పిర్యాదు చేయలేదని, అయినప్పటికీ విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఇంటి వద్దనే పింఛను అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎన్నికల నిబంధనలు అమల్లో ఉందని వృద్దులు, వికలాంగులు, ఇతర పెన్షన్ దారులకు పెన్షన్ అందించడంలో ప్రభుత్వం కావాలనే తీవ్ర జాప్యం చేస్తుందని సిపిఎం మార్టూరు, యద్దనపూడి ప్రాంతీయ మండలాల కార్యదర్శి బత్తుల హనుమంతరావు ఆరోపించారు. ఎన్నికల వేళ వలంటీర్లతో లబ్దిదారులకు పెన్షన్ పంపిణి చేయించడం ఆపాలని ప్రతిపక్ష టిడిపి ఈసీకి చేసిన ఫిర్యాదుతో ప్రభుత్వం పెన్షన్ పంపిణి జాప్యం చేయడం దారుణమని అన్నారు. 3న సచివాలయాల వద్ద పెన్షన్ అందిస్తారని ప్రచార మాధ్యమాల్లో తెలుసుకొని కొంతమంది పెన్షన్ దారులు మండుటెండలో వచ్చి సచివాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారని తెలిపారు. నగదు ఇంకా బ్యాంకులో పడలేదని సిబ్బంది తెలపడంతో నిరాశగా వెనుదిరిగి పోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పెన్షన్ డబ్బులతోనే ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. పెన్షన్ ఎప్పుడు అందిస్తారో తెలియక ఎండలో పడిగాపులు పడుతూ ఎదురు చూస్తున్న వారి పరిస్థితి చూసైనా సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో లబ్దిదారులకు ఇళ్ల వద్దే పెన్షన్ అందించాలని డిమాండ్ చేసారు. పెన్షన్ పంపిణి చేయడంలో జరుగుతున్న జాప్యం గురించి ఎంపిడిఓ గొరికపుడి నితిన్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా అయన స్పందించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా 3 వ తేదీనే సచివాలయ సిబ్బందితో పెన్షన్లు అందించడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. రిజర్వు బ్యాంకు నుండి స్థానిక బ్యాంకులకు నిధుల బదిలీల్లో జరిగిన జాప్యం వల్ల బుధవారం సాయంత్రం వరకు పంచాయతీ కార్యదర్శుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతుండటంతో పెన్షన్ల పంపిణీలో జాప్యం జరిగిందని తెలిపారు. నేటి నుండి పూర్తీ స్థాయిలో పెన్షన్లు సచివాలయ సిబ్బందితో లబ్దిదారులకు అందిస్తామని, ఎవరు ఆందోళన చెందొద్దని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ముఖ్యమైనదని, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఎన్నికల సంఘం కల్పించిన ఇంటివద్దనే ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయాన్ని అయన బుధవారం సందర్శించారు. తహశీల్దారు కోటంరాజు సంధ్యశ్రీ, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సంఘం అధిక వైకల్యంన్న వారికి, 85ఏళ్ళ వయస్సు పైబడిన వయోవృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు వినియోగించుకోవడం ముఖ్యమని అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాలతో పాటు బీఎల్‌ఒల ద్వారా తమ ఓటు వివరాలు తెలుసుకోవాలని అన్నారు. హెూం ఓటింగ్ కోసం అర్హులైన వారు ఫారం -12 డీ సాయంతో పీబీ మార్కింగ్ చేయించుకోవాలని అన్నారు. ఇంటి వద్దనే ఓటింగ్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్, భద్రతా సిబ్బంది ఉన్న ప్రత్యేక బృందం ఇంటి వద్ద ఓటింగ్ విధానాన్ని వీడియో గ్రఫీ చేస్తారని వివరించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అయన ప్రారంభించారు. స్థానిక పాండురంగ స్వామి ఆలయం వద్ద ఫారం - 12 డీ కొరకు దరఖాస్తు చేసుకున్న కుటుంబానికి మంజూరు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ గోరికపుడి నితిన్, డిప్యూటీ ఎన్నికల తహాశీల్దారు కోదండరాం, డీటీ అందె శివశ్రీను, ఆర్ఐ రహమాన్ బాషా పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ రవీంధర్

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగినందున ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ హేలా షారోన్ అన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన చర్యలపై సమన్వయ కమిటీ సమావేశం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో బుదవారం నిర్వహించారు. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని అన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇచ్చిన దృష్ట్యా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం వేసవిలో పగటి ఉష్ణోగ్రత 47నుంచి 48.3 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 60 నుంచి 70ఏళ్లు దాటిన వారి ఆరోగ్య పరిస్థితిని గమనించాల్సి ఉందని అన్నారు. చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. వడదెబ్బ బారిన పడిన వారికి వెంటనే తగిన చికిత్స అందించేలా అర్బన్ హెల్త్ సెంటర్లలో అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వడగాడ్పులు పెరిగితే పశువులు, గేదెలు, పక్షులు, జంతువులు మృతి చెందే అవకాశం ఉందని, మరణాల నివారణపై చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేలా షారోన్

గునుపూడి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - పొదిలి

ఆర్యవైశ్య సంఘ నాయకులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక పెద్దబస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మాతృమూర్తి వరలక్ష్మమ్మ బుధవారం ప్రారంభించారు. గునుపూడి భాస్కర్, మాధవి దంపతుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా లాగే ఈసంవత్సరం కూడా 24గంటల చలివేంద్రం ఏర్పాటు తో ప్రజలదాహర్తి తీరుస్తున్నం దుకు అభినందనలు తెలిపారు. మాజీ జడ్‌పిటిసి కాటూరి నారాయణ బాబు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ ఇమాంసాహెబ్, గునుపూడి చెంచు సుబ్బారావు (జిసి), గునుపూడి మధు సూధన్ రావు, సామి రాజా, పోపూరి నరేష్ పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న గునుపూడి భాస్కర్



కామ్రేడ్ కృష్ణమూర్తికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

వల్లభనేని ఆశయాలు సాధిద్దాం

ప్రజాశక్తి - వేమూరు

వైద్య వృత్తిలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించిన కామ్రేడ్ పల్లమనేని కృష్ణమూర్తి ఆశయాలు సాధించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. వల్లభనేని కృష్ణమూర్తి సంతాప సభ బుధవారం విజయవాడలో నిర్వహించారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం ఆముదాలంక గ్రామానికి చెందిన కృష్ణమూర్తి వైద్య పరంగా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ సిపిఎం పిలుపునిచ్చిన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారని గుర్తు చేసుకున్నారు. రైతు కూలీ సమస్యలు చల్లపల్లి జమిందారు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించిన వ్యక్తి కృష్ణమూర్తి అన్నారు. ఐద్వారాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ కృష్ణమూర్తి తుది శ్వాస వరకు సిపిఎం సభ్యునిగా కొనసాగారని అన్నారు. రావిలంక భూముల పోరాటం, భూముల పరిరక్షణ కమిటీ సభ్యునిగా అనేక సేవలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల, గుంటూరు జిల్లాల సిపిఎం నాయకులు, కార్యకర్తలు, కృష్ణమూర్తి సహ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి అశోక్‌రెడ్డి

ఆదరించండి అభివద్ధి చేస్తా

ప్రజాశక్తి - బేస్తవారిపేట

రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని, మరింత అభివద్ధి చేస్తానని గిద్దలూరు టిడిపి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. కోనపల్లి, సింగసానిపల్లి, సింగరపల్లి, బార్లకుంట, హనుమాయపల్లి, బాలేశ్వరపురం, గలిజేరుగుల్ల, పి వెంకటాపురం, అక్కపల్లి, బసినేపల్లి, ఎంపీ చెరువు, కొత్తపేట, కాజీపురం, పిటకాయ గుళ్ల, జేసీ అగ్రహారం, వంగపాడు కొత్తపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ కొండ సాయిబాబు, మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్ రెడ్డి, ఎంపీటీసీ పూనూరు భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ జి రామలింగారెడ్డి, నాదెళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న గొట్టిపాటి హర్షవర్ధన్

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - సంతమాగులూరు

చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతోనే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని అద్దంకి ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. కొప్పరంలో బుధవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీసీ నాయకులతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, అట్లా పెద వెంకటరెడ్డి, నెంబర్ మౌలాలి, ముల్లా సుభాని, సయ్యద్ సుభాని, గుంజి శ్రీను, గుంజి అంకమ్మరావు, కొనికి గోవిందమ్మ, గుమ్మా జ్యోతి, మాదాల సుబ్బారావు, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, సన్నెబోయిన గురు యాదవ్, మాజీ ఎంపీటీసీ బోడె పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 4 ఏప్రిల్ 2024

గొట్టిపాటి లక్ష్మి నేడు దర్శికి రాక

- ఈపాటికే ఆమె కుటుంబీకులు వ్యూహాత్మక భేటీలు
- పూర్తి తమ కుమార్తె గెలుపుపై దృష్టి సారించిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి
- దర్శి ఉప ఎన్నికలో అప్పటి మంత్రి గొట్టిపాటి హనుమంతరావు కీలకపాత్ర

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో పోటీ చేస్తున్న తెలుగుదేశం కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి బుధవారం దర్శి నియోజకవర్గంలోకి తొలిసారిగా వస్తున్నారు. ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే ఆమె భర్త, మామలు మండల ముఖ్య నేతలతో వ్యూహాత్మక భేటీలు పూర్తి చేశారు. మండలాల్లో పార్టీ నేతలతో మంతనాలు సాగించారు. జనసేన నేతలను కలిశారు. జిల్లా నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నాడు దర్శిలో పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పార్టీ జిల్లా నేతలను కూడా ఆహ్వానించారు. దర్శిలో రెండు పార్టీల నుంచి డాక్టర్లుగా ఉన్నవారే అభ్యర్థులుగా తలపడుతున్నారు. దర్శిలో ఉత్కంఠ పోరుకు మరోసారి రంగం సిద్ధమైంది. దర్శిలో తెలుగుదేశం అభ్యర్థి ప్రకటనలో అసాధారణ జాప్యం జరిగింది. పార్టీ వర్గాలు అభ్యర్థి కోసం ఎదురుచూస్తున్నాయి. నాన్చుడు వల్ల నష్టం జరిగిందనే భావన కూడా పెరిగింది. ఎట్టకేలకు దర్శికి అభ్యర్థిని ఖరారు చేశారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోదరుడు నరసయ్య కుమార్తె లక్ష్మి. ఈమె భర్త కడియాల లలిత్‌కుమార్ కూడా వైద్యులే. కడియాల కుటుంబం నరసరావు పేటలో తెలుగుదేశం పార్టీకి కీలకంగా పనిచేశారు. కోడెల శివప్రసాద్‌కు మంచి అనుచరులుగా ఉన్నట్లు చెబు తున్నారు. రాజకీయాలతో సంబంధం ఉన్న కుటుంబమే. ఈ నేపథ్యంలో దర్శి టిక్కెట్టు కోసం చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బంధుత్వం ఉన్న నేపథ్యంలో గొట్టిపాటి రవికుమార్‌ను సంప్రదించారు. టిక్కెట్టు ఇప్పించాలని కోరారు. చంద్రబాబుతో కలిసి చర్చించారు. తర్జనభర్జనల అనంతరం గొట్టిపాటి లక్ష్మి పేరును ఖరారు చేశారు. ఇపుడు నియోజకవర్గంలో గెలుపు కోసం పావులు కదుపుతున్నారు. అటు ఎమ్మెల్యే గొట్టిపాటి కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆయన కూడా ఇక్కడ ఎలా ముందుకుపోవాలన్న దానిపై దిశానిర్దేశం చేస్తున్నారు. మండలాల్లో ఎవరికి కీలక బాధ్యతలు అప్పగించాలి? ఇతర విషయాలు ఎలా సమర్థవంతంగా నిర్వహించాలనే దానిపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముండ్లమూరు మండలంలో గొట్టిపాటికి మార్టూరు ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి సంబంధాలున్నందున ఇది కూడా కలిసివచ్చిందని భావిస్తున్నారు. నేరుగా గొట్టిపాటి పలువురు నేతలతో మాట్లాడారు. మిగతా మండలాల్లోనూ పార్టీపరంగా నేతలతోనే మాట్లాడుతున్నారు. దర్శి నియోజకవర్గంలో పాతికేళ్ల నుంచి ఉన్న గొట్టిపాటి రాజకీయ సంబంధాలను గుర్తుచేస్తున్నారు. దర్శి ఉప ఎన్నికల్లో అప్పట్లో నారపుశెట్టి పాపారావు గెలుపునకు అప్పట్లో మంత్రిగా ఉన్న గొట్టిపాటి హనుమంతరావు కీలకపాత్ర పోషించారు. ఈ విషయాన్ని ఇపుడు నియోజకవర్గంలో పలువురు నేతలు ప్రస్తావించుకుంటున్నారు. ఇవి కూడా దోహదపడతాయని భావిస్తున్నారు. ఇక పార్టీ అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడం కూడా సవాలుగా మారింది. అనేక అవరోధాలను అధిగమించాల్సి ఉంది. ఎందుకంటే వైసిపి అభ్యర్థి బూచేపల్లి ఇప్పటికే ప్రచారం ఒక దశ పూర్తి చేశారు. తెలుగుదేశం నుంచి ఇపుడు ప్రచారంతో పాటు అన్ని రకాల వ్యూహాలను కూడా కొత్తగా నడపాల్సి ఉంది. అయితే అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పాత్ర ఇపుడు కీలకంగానే ఉంది. తమ కుటుంబం నుంచి మరో రాజకీయ వారసురాలు రావడంతో ఎమ్మెల్యే రవికుమార్ కూడా ప్రతిష్టాత్మకంగానే తీసుకుంటున్నారు.



టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం మాజీ జడ్పీటీసీ సభ్యులు కుప్పా రంగసాయి గిద్దలూరు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డిని మండలంలోని చినగాని పల్లె గ్రామంలోని తన నివాసానికి ఆహ్వానించి తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో మాజీ జడ్పీటీసీ కుప్పా రంగసాయి, వారి అనుచరవర్గం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిని అశోక్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని కుప్పా రంగసాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముత్తుముల అశోక్‌రెడ్డితో కుప్పా రంగశాయి

కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-కనిగిరి

స్థానిక పామూరు రోడ్డులోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను కళాశాల ప్రిన్సిపల్ జే ఉషారాణి బుధవారం ప్రారంభించారు. బీకాం కంప్యూటర్స్, త్వరలో ప్రారంభించనున్న బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సులకు సంబంధించి విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, స్కిల్స్ ల్యాబ్ ఏర్పాటు వలన పెరుగుతుందని ఆమె తెలిపారు. ల్యాబ్ అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ జె ఉషారాణి

టిడిపిని ప్రజలు ఆదరిస్తున్నారు: కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను రూపొందించి రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీని ప్రజలు స్వాగతిస్తున్నారని నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ప్రజాగళం ఎన్నికల శంఖారావం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వర రావుతో కలసి 3వ రోజు ఈపురుపాలెంలో గాంధీ పార్క్ ఏరియా, కుమ్మరి వీధి, ముస్లిం ఏరియా పలు ప్రాంతాలలో డోర్ టు డోర్ క్యాంపెయిన్‌ను చీరాల తెలుగుదేశం, కూటమి నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్యకు ఆ ప్రాంతవాసులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఇంటింటికీ సూపర్ సిక్స్ పథకాలు, బిసి డిక్లరేషన్ ద్వారా అమలయ్యే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను, సీనియర్ నాయకులు కౌత్తవరపు జనార్ధన్, మైనార్టీ నాయకులు యాసీన్, ఈపురుపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి సీనియర్ నాయకులు గుద్దంటి చంద్రమౌళి, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రచారంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య

గెలుపునకు సహకరించాలి: కరణం వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల

జరగనున్న ఎన్నికలలో పూర్తి మద్దతును అందించి తన గెలుపునకు సహకరించాలని వైసిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక ఉడ్‌నగర్‌లోని ఆయన పర్యటించారు. వైసీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ హాస్పిటల్ ఎండి డాక్టర్ బాబురావు దంపతులను, మాజీ చైర్మన్, సీనియర్ నాయకులు సలగల దేవదానం దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికలలో తనకు పూర్తి మద్దతును అందజేసి తన గెలుపునకు సహకరించాలని వారిని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణ గురించి కొద్దిసేపు వారితో చర్చించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పలువురు కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.



సలగల దేవదానం నివాసం వద్ద కరణం వెంకటేష్



స్థల పరిశీలన చేస్తున్న వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ

రేపు 'చెవిరెడ్డి' ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ, కనిగిరి రూరల్ కార్యకర్తలతో వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆత్మీయ సమావేశం ఈ నెల 5న కనిగిరిలో జరగనుండగా బుధవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ స్థల పరిశీలన చేశారు. నాయకులతో కలిసి కొత్తూరులోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో సమావేశం నిర్వహణకు స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట పిడిసి బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, వైసిపి నాయకులు చింతం శీను, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

'అబ్బూరి'కి ఘన నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మంగమూరులో బుధవారం గ్రామ సీనియర్ నాయకుడు అబ్బూరి నరసయ్య పెద్దకర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్ కుమార్ హాజరయ్యారు. నరసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరిచేటి శ్రీనివాసరావు, అబ్బూరి కోటేశ్వరరావు, అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి కృష్ణారావు, తక్కెళ్ల కల్యాణ చక్రవర్తి, వలేటి రవి, కంకణాల గోపికృష్ణ తాటితోటి నరసింహారావు, పరుశు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీఎన్ విజయ్‌కుమార్

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పామూరు

పామూరు పట్టణానికి చెందిన కాపు సంఘ నాయకులు వరికూటి చిరంజీవి వరికూటి హనుమంతు వారితో పాటు నలభై కుటుంబాలు కనిగిరి ఇన్‌ఛార్జి ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో చేరారు. బుధవారం పామూరు పట్టణానికి చెందిన బోయల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన మిత్రవర్గం, స్నేహితులు, 40 కుటుంబాలు కనిగిరిలో ఉగ్ర క్యాంప్ కార్యాలయం వెళ్లి ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా తవలు వేసికొని పార్టీలో చేరినట్లు చిరంజీవి తెలిపారు. చిరంజీవి మాట్లాడుతూ ఉగ్ర గెలుపు కోసం తమవంతు కృషి చేస్తామని ఉగ్రకు హామీ ఇచ్చారు. ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తనకు సహకరించిన ప్రతి ఒక్కరినీ తాను మర్చిపోనని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో వెంకటస్వామి, రాంబాబు, శ్రీను మరికొందరు ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఉగ్రనరసింహారెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాకారమవుతుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని గుట్ల ఉమ్మడివరం ఎస్సీ పాలెంలో సూపర్ సిక్స్, బాబు షూరిటి-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల శంఖారావంలో టిడిపికి అఖండమైన మెజారిటీని ఇచ్చి గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికలలో తనను ఎమ్మెల్యేగా, మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఎంపిగా గెలిపించాలని కోరారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి గ్రామంలో వివరించి రానున్న ఎన్నికలలో ఓట్లు వేయించడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వలరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

ప్రజాశక్తి-కొండపి: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని నోడల్ అధికారి టి విక్టోరియారాణి ఓటర్లు తెలిపారు. బుధవారం కొండపి మండలంలోని మూగచింతల గ్రామంలో ఓటింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ గురించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, ఓటు ఎంతో విలువైందని, ఒక్క ఓటుతో మంచి నాయకుల్ని ఎంచుకోవచ్చునని తెలిపారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, ఎలక్షన్ కమిషన్ బ్యాలెట్ ఓటు కల్పించిందని తెలిపారు.

పథకాలు అందాలంటే వైసిపి రావాలి

ప్రజాశక్తి-దర్శి: ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి అంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని వైసిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం తాళ్లూరు మండలంలోని దోసకాయలపాడు పంచాయతీలో దోసకాయలపాడు తోట వెంకన్నపాలెం బెల్లంకొండవారిపాలెంలలో జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వృద్ధులకు, వితంతువులకు ఇచ్చే పెన్షన్లు అందకుండా తెలుగుదేశం, జనసేన, బిజెపిలు కుట్ర చేశాయని అన్నారు. భవిష్యత్తులో వైసిపికి పట్టం కడితేనే వాలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ఉంటాయని, పెన్షన్లు సకాలంలో అందుతాయని అన్నారు. ఆయా గ్రామాల ప్రజలు పూలదండలతో హారతులు పట్టారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కిమ్స్ వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని పావులూరు జెడ్‌పి హై స్కూలులో ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. 245 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటికి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. గుండె, కిడ్నీ, విష జ్వరాలు వంటి వ్యాధులకు వైద్యులు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోగ నిర్ధారణ జరిగిన 55మందికి ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్‌ఐ, ఈహెచ్‌ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. క్యాంపులో డాక్టర్ రామాంజనేయులు, మహిత, రాణి పాల్గొన్నారు.



సమావేశంలో ఎస్‌ఇబి డిప్యూటీ కమిషనర్ బాజీరావు

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

అక్రమ మద్యం, నాటుసారాపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్‌ఇబి డిప్యూటీ కమిషనర్ ఎస్‌వివిఎన్ బాజీరావు పేర్కొన్నారు. స్థానిక ఐఎంఎల్ డిపో నందు ప్రొహిబిషన్ అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్రమ మద్యం, నాటు సారాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం, బెల్ట్ షాపులు, నాటుసారా నియంత్రణకు ఎక్సైజ్, పోలీస్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా అక్రమాలు జరుగుతుంటే వెంటనే తమకు తెలియజే యాలని కోరారు. ప్రజలు కూడా అధికారులకు సహకరిం చాలని అన్నారు. సమావేశంలో ఏసి వి రేణుక, జడ్ఎం శివప్రసాద్, బియ్యం రాధాకృష్ణ, ఎన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు

ప్రభుత్వ పథకాల ప్రచారం

ప్రజాశక్తి - రేపల్లె

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఆయుధాలుగా వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, నియోజకవర్గ పరిశీలకులు మధుసూదనరెడ్డి, ఎన్నికల అబ్జర్వర్ అడపా శేషు, మాజీ ఎంఎల్‌ఎ దేవినేని మల్లికార్జునరావు, వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి డాక్టర్ గణేష్, పేటేరు వైసిపి ఇంచార్జ్ కనపర్తి రవికిరణ్, వైస్ ఎంపీపీ రావు ప్రభాకరరావు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. గుండెపాటమ్మ తల్లి అమ్మవారి గుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. నేతన్నల బజారు నుండి ప్రచారం చేపట్టారు. చేనేత బజారు నుండి ఇందిరా కాలనీ, ఆంజనేయ స్వామి కాలనీ, శ్రామిక నగర్, గౌడ పాలెం, ఆరేపల్లి బజార్, గుంటూరు వారిపాలెం, యాదవు పాలెం, వాకావారి బజారు, తూర్పు మాలపల్లి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిపై అసత్య ప్రచారం తగదు

ప్రజాశక్తి - బాపట్ల

వైసీపి పాలనలో ప్రజలకు చేసిన ప్రగతి చెప్పుకోవడానికి ఏమి లేక టిడిపి అధినేత చంద్రబాబు ఫెన్షన్లు రాకుండా చేస్తున్నారని వైసీపి నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ఓటు రాజకీయాలకు పాల్పడుతున్నారని టిడిపి కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ మండిపడ్డారు. లబ్ధిదారులకు పెన్షన్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ భాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులకు ఇచ్చే ఫెన్షన్‌లను టిడిపి అడ్డుకుంటుందనే తప్పుడు ప్రచారం మానుకోవాలని అన్నారు. వాలంటీర్ వ్యవస్థకు తామేమీ వ్యతిరేకం కాదని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచనుందని అన్నారు. వృద్ధులు, వికలాంగులు ఎండలో ఫెన్షన్ల కోసం ఇబ్బందులు ఎదుర్కోకుండా సజావుగా పంపిణీ చేయాలని అన్నారు. ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు రెండు నెల్ల పాటు వృద్ధులు, వికలాంగులకు సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయాలని కోరారు. పట్టణంలోని భీమవారిపాలెం సచివాలయం వద్ద పెన్షనర్లతో మాట్లాడారు. ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు.



మాట్లాడుతున్న నరేంద్ర వర్మ

మేనిఫెస్టోతో ప్రజల వద్దకు వెళ్తాం : కాంగ్రెస్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కాంగ్రెస్ అధిష్టానం ఎన్నికల్లో ప్రజలకు చేకూర్చే లబ్ధిపై రూపొందించిన మేనిఫెస్టోతో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి బూరగ సుబ్బారావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా పదేళ్లపాటు కొనసాగించడం, ఉపాధి హామీ కూలీలకు పని దినాలు పెంచి రోజుకు రూ.400వేతనం, తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఏడాదికి రూ.లక్ష అందించడం, ఇల్లు లేని బడుగు, బలహీన, నిరుపేదలకు పక్కా గృహాల నిర్మాణానికి రూ.5లక్షలు, వృద్ధులకు రూ.4వేలక పెన్షన్ పెంపుదల చేస్తమాని చెప్పారు. రాష్ట్రంలో 2.20లక్షల ఉద్యోగాలను ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తాడికొండ వెంకటేశ్వ రరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోతారులంక ఏడుకొండలు, పట్టణ అధ్యక్షులు గౌస్ బేగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సుబ్బారావు

సాగర్ నీటి కోసం ప్రజల ఎదురుచూపు

ప్రజాశక్తి - పొదిలి

మండలంలో దాహం కేకలు రోజురోజుకు మిన్నంటుతున్నాయి. గుక్కెడు మంచినీటి కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక వైపు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీరు లేదని అధికారులు చెబుతున్నా ఆ నీరు తాగకపోతే దాహం తీరని పరిస్థితి. మినరల్‌వాటర్ తాగితే ఒళ్లు నొప్పులు, కిడ్నీలు దెబ్బతింటు అనారోగ్యం బారిన పడుతున్నామని చెబుతున్నారు. తప్పని సరిగా సాగర్ నీరు తాగని పరిస్థితి దాపురించింది. దీంతో మండలంలోని గ్రామాల ప్రజలు సైతం 10–15 కిలోమీటర్ల దూరం నుండి ద్విచక్ర వాహనాలతో వచ్చి పొదిలి శివాలయం సంప్ వద్ద నీరు పట్టుకుపోతున్నారు. ఇంతటి దుస్థితికి కారణం ఎవరంటే అధికారులు, కాంట్రాక్టర్లు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ప్రజల గొంతు ఎండబెడుతున్నారు. దశాబ్దాలుగా భూగర్భ జలాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు వాటిని తాగి ఫ్లోరిన్ బారిన పడి కిడ్నీలు దెబ్బతిని తనువు చాలించిన వారు ఉన్నారు. ఈ స్థితిలో అనుకోకుండా నెదర్లాండ్ దేశ ఆర్థిక సహాయంతో సుమారు ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పథకాన్ని సద్వినియోగం చేసి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెంచాల్సిన పాలకులు, నాయకులు పట్టించుకోవడం లేదు. సంక్షేమం పేరుతో రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నపాలకులు భవిష్యత్తు తరానికి మంచినీటి సంక్షోభాన్ని తీర్చేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో చేస్తున్న కాలయాపన అంతా ఇంతా కాదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ఏడాది సరైన వర్షపాతం లేకపోవడంతో భూగర్భ జలాలు కూడా అడుగంటి పోయాయి. వాడుక నీటికి ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పరిధిలో ప్రజల దాహార్తికి ఈ నెల 8న నీరు విడుదల చేస్తామని కలెక్టర్ ప్రకటించిన నేపధ్యంలో వాటిని త్వరగా విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. 8న విడుదల చేసినా నీరు ఇక్కడకు రావడానికి మరోవారం10 రోజులు పట్టనుంది. వారి తీరు వస్తే ఇస్తాం అన్నట్లు ఉందని మన వాటా తెచ్చుకోవాలనే పట్టుదల కనిపించడంలేదు. అదేమంటే పైన నీరు లేదు మేమి ఏమిచేయలేం అంటూ నిర్లక్ష్య సమాధానం చెబుతున్న తీరుతో ప్రజలు తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు అయినా స్పందించి సాధ్యమైనంత త్వరగా మంచినీటి కోసం సాగర్ నీరు విడుదల చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పొదిలి పట్టణంలో సాగర్ నీటి కోసం బిందెలతో బారులు తీరిన మహిళలు

సమస్యలు పరిష్కరించాలని వినతి

మద్దిపాడు : తమ కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కషి చేయాలని మండల పరిధిలోని దొడ్డవరం గ్రామ వడ్డెర కాలనీ వాసులు టిడిపి సంతనూతలపాడు నియోజక వర్గ అభ్యర్థి బిఎన్.విజయకుమార్ దష్టికి తీసుకెళ్లారు. దొడ్డవరం గ్రామంలో వడ్డెర సంఘం నాయకులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విజయకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వడ్డెరపాలెంలో మంచి నీరు, రోడ్డులు, వీధి లైట్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సమస్యలను పరిష్కరిస్తామని విజయకుమార్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సెక్రటరీ ఆడక స్వాములు, మండల అధ్యక్షుడు మండవ జయంత్, గ్రామ అధ్యక్షుడు కుంచాల రామాంజి, వల్లెపు రామాంజనేయులు, వల్లెపు అంకమ్మ రావు, వల్లెపు వెంకటేశ్వర్లు, వడ్డెంపూడి శ్రీనివాసరావు, మలిపేద్ది బాలకష్ణ, కొండపల్లి పవన్, సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్

స్థానికులకే పట్టం కట్టాలి

ప్రజాశక్తి - అద్దంకి

స్థానికతకు ప్రాధాన్యత ఇచ్చి స్థానికుడనైన తనను ఆశీర్వదించాలని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్ కోరారు. ఏఐసిసి ఆదేశాల మేరకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి తనను అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. స్థానిక రామనగర్‌లోని ఆయన నివాసంలో విలేకర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. తన దగ్గర డబ్బు లేదని, కానీ జీవితం విలువ తెలిసిన వాడినని అన్నారు. కరోనా సమయంలో తనకు కరోనా సోకి ఆర్థికంగా డబ్బులేక ఈ భూమి మీద నూకలు ఉండి వైద్యుల సహకారంతో మృత్యువుతో పోరాడి జీవితాన్ని గెలిచానని అన్నారు. అప్పటి నుండి సమాజ సేవలో తన వంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గుంటూరు లోని వికాస్ కార్పొరేట్ హాస్పిటల్ తమకు సంబంధించిన హాస్పిటల్ అన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురై అక్కడ వైద్యం చేయించు కుంటే 50శాతం రాయితీ ఇప్పిస్తానని అన్నారు. అద్దంకిలో ఎప్పుడో స్థానికులు ఎంఎల్‌ఎలుగా పోటీ చేశారు. 1978నుండి 2024 వరకు ఎంఎల్‌ఎలుగా స్థానికేతరులు పోటీ చేస్తున్నారని అన్నారు. 2.50లక్షలు ఓటర్లు ఉన్నారని, వారిలో ఒక్కరైనా ఎంఎల్‌ఎకి అర్హులు కారా అని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల నుండి డబ్బున్న వారినే పోటీలో నిలుపుతున్నారని అన్నారు. వారు ఇచ్చే డబ్బుకు లొంగి ఓట్లు వేసి గెలిపిస్తున్నారని అన్నారు. గెలిచిన వాళ్ళు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయక పోగా వాళ్ళ పదవులను అడ్డం పెట్టుకొని వాళ్ళ వ్యాపారాలు చేసుకుంటూ వలస పక్షుల్లాగా, చుట్టం చూపుగా పెళ్లిళ్లకు, ఇతర కార్యక్రమాలకు హాజరవుతున్నారనేది ప్రజలు గుర్తించాలని అన్నారు. 2029నాటికి అద్దంకి రూపు రేఖలు మార్చడం ఖాయమని అన్నారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ పాలపర్తి నరసింహారావు, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కోరే సురేంద్ర, కబలా సుబ్రహ్మణ్యం, రోజా రాణి, శ్రీనివాసరావు యాదవ్ పాల్గొన్నారు.

మొదలైన...మాటల తూటాలు...!!

ప్రజాశక్తి - మార్కాపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతల మాటలు తూటాల్లా పేలుతున్నాయి. మార్కాపురంలో ఇటీవల నిర్వహించిన ప్రజాగళం సభలో టిడిపి అధినేత చంద్రబాబు ఘాటు విమర్శలు చేశారు. వైసిపి ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయనున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఓ ఎర్ర చందనం స్మగ్లర్ అంటూ ఆరోపిం చారు. సిఎం జగన్‌పైనా విమర్శలు ఎక్కుపెట్టారు. దీనిపై వైసిపి తీవ్రంగా స్పందించింది. ఒంగోలు వైసిపి ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబులు మార్కాపురంలో భారీ స్థాయిలో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌వికెపి కళాశాల ఎదురుగా ఉన్న మైదానంలో సభ నిర్వహించారు. ఈ సభలో వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, ఎపిఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు. గజ దొంగలను పక్కనబెట్టుకుని చంద్రబాబు నీతి వాఖ్యాలు వల్లించడం హాస్యాస్పదం అన్నారు. ఈ ప్రాంతానికి చంద్రబాబు చేసిందేమీ లేకపోయినా అభివృద్ధి చేసిన సిఎం జగన్‌ను విమర్శించడం తగదన్నారు. మార్కాపురం కేంద్రంగా హిమ్ కుంభకోణం పెద్ద ఎత్తున జరిగిన దాంట్లో మీ అభ్యర్థి కందుల పాత్ర లేదా అని ప్రశ్నించారు. ఎందరో పేదలు హిమ్ కుంభకోణంలో చితికిపోయారన్నారు. భూ కబ్జాలకు పాల్పడినట్లు ఆరోపించారు. చేసింది చెప్పుకుని ఓటర్లను మెప్పించి ఓట్లడగాలే కానీ ఓట్లేయకపోతే శవాన్ని చూడాల్సి వస్తుందనడం ఏమిటన్నారు. ఈ విధంగా ఓట్లు అడగడం దిగజారుడుకు నిదర్శనమని జంకె వెంకటరెడ్డి ఘాటుగా స్పందించారు. ఎన్నికల సమయం దగ్గర పడేకొద్దీ మార్కాపురంలో మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోనుందని, ఇది ఆరంభమే అని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

చలివేంద్రాలు ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - మార్కాపురం

ఎస్‌సివికె నిలయం, రీడింగ్ రూమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజల దాహర్తి తీర్చేందుకు ఎస్‌సివికె నిలయం ప్రాంగణంలో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. సెక్రటరీ గుంటక సుబ్బారెడ్డి, అధ్యక్షులు డాక్టర్ ఐ బాల సుబ్బారావు, ఉపాధ్యక్షులు శాసనాల వీరబ్రహ్మం, జాయింట్ సెక్రటరీ మసాని మోహనరెడ్డి, కోశాధికారి పి మల్లికార్జునరావు ప్రారంభించినారు. కార్యక్రమంలో గుంటక వెంకటరెడ్డి, మొగుళ్లూరి మల్లికార్జునరావు, యక్కలి రమేష్, మద్దాల కృష్ణరావు, పఠాన్ హుస్సేన్ ఖాన్, కుందూరు వెంకటరెడ్డి, బచ్చు కృష్యయ్య పాల్గొన్నారు.

యద్దనపూడి : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద బాపట్ల ఆర్‌డిఒ రవీందర్ చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా పెరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పశువులు, పక్షులుకు కూడా నీటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. తహశీల్దారు కర్యాలయాన్ని, మోడల్ పోలింగ్ బూత్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు నాగరాజు, డిప్యూటి తహశీల్దారు విష్ణు, భాస్కరరావు, విఆర్‌ఒలు సత్యం, రవి, వసంతరావు, శేషుబాబు, విఆర్‌ఎలు మస్తాన్, కిషోర్ పాల్గొన్నారు.

పర్చూరు : కలెక్టర్ పి రంజిత్‌బాషా ఆదేశాల మేరకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఆర్డిఓ గంధం రవీందర్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఆర్డీఒ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సుబ్బయ్య, ఎంఈఒ పి వెంకట్రామయ్య, ఆర్‌ఐ ప్రేమ్ కుమార్, డిప్యూటీ తహశీల్దారు నాగలక్ష్మి పాల్గొన్నారు.


పర్చూరులో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ రవీంధర్

విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరులోని మాజీ జీడీసీసీబీ డైరెక్టర్, టిడిపి సీనియర్ నాయకులు గుదేటి బ్రహ్మారెడ్డి విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించి దగ్ధం చేశారు. ఆ ప్రాంతాన్ని టిడిపి అభ్యర్థి, మాజీమంత్రి నక్కా ఆనందబాబు సందర్శించారు. బ్రహ్మారెడ్డి విగ్రహానికి నిప్పంటించిన దుండగులను తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అరాచకాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కొల్లూరులో కులాల మధ్య చిచ్చు రేపటమే కాక భట్టిప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద అధికారులను బెదిరించారని అన్నారు. ఓ విలేకరిపై దాడి చేసి సెల్ఫోన్ కూడా లాక్కున్న సంఘటనలు ఉన్నాయని అన్నారు.


బ్రహ్మారెడ్డి విగ్రహం వద్ద ఆనందబాబు నిరసన

టిడిపికి మద్దతునిచ్చే ఎన్నారైలను కూడా విదేశాలకు వెళ్లకుండా చేస్తానని వైసిపి అభ్యర్థి వ్యాఖ్యానించటం పట్ల గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు వైసిపి చేస్తుందని అన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అంధకారంలో ఉన్న రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత టిడిపి కార్యకర్తలు తీసుకోవాలని టీడీపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో యద్దనపూడి, మార్టూరు మండలాల క్లస్టర్ సమావేశం బుధవారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ చేతగానితనం వల్ల పెన్షన్ సకాలంలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాజకీయ కక్ష సాదింపులో భాగంగానే పెన్షన్లపై వైసీపీ రాజకీయం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తు, మన బిడ్డల భవిష్యత్తు కోసం చంద్రబాబును గెలిపించుకోవాలని కోరారు. పేదరికం లేని సమాజం కోసం, అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని అన్నారు. వైసిపి దౌర్జన్యాలు, అరాచకాలు, తప్పుడు ప్రచారాలకు త్వరలో ముగింపు పడుతుందన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు

గ్రామాల్లో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పొదిలి

దశాబ్దాలుగా అభివృద్ధి నోచుకోని పొదిలి మండలానికి వెలుగొండ జలాలు తేవాలంటే టిడిపితోనే సాధ్యమవుతుందని మార్కాపురం టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని నిమ్మవరం, రాములవీడు గ్రామాల్లో ఇంటింటికి మన కందుల కార్యక్రమం ఆయన తనయుడు విగ్నేష్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిని గెలిపించాలని కోరారు. గత 22ఏళ్ల నుండి ప్రజల ప్రజాసేవలోనే గడిపానని నారాయణరెడ్డి అన్నారు. వచ్చే టిడిపి ప్రభుత్వంలో రెండేళ్లలోపు వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి పొదిలికి వెలుగొండ జలాలు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. మార్కాపురం ప్రత్యేక జిల్లాతోనే సాధ్యమని తెలిపారు.


కార్యకర్తలతో కందుల నారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఎంసి ఛైర్మన్ బసవపున్నారావు

జడ్‌పిటిసి పదవికి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

జడ్పీటీసీ సుబ్బయ్య తన పదవికి రాజీనామా చేయాలని కూచినపూడి ఎఎంసి ఛైర్మన్ పందరబోయిన బసవపున్నారావు, వైసీపీ నాయకులు నర్రా నాగేశ్వరావు కోరారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు పొంది ఇప్పుడు టిడిపిలోకి వెళ్లడం అంత మంచి విషయం కాదన్నారు. అతను చిన్నవాడైనప్పటికీ గౌరవించామని అన్నారు. మోపిదేవి సోదరులు తన సొంత మనిషిగా భావించారని, తమకు ఏమైనా సమస్యలు ఉంటే మాట్లాడితే సరిపోయేదని అన్నారు. గతంలో సుబ్బయ్య అంటే యాదవుల్లో గౌరవం ఉండేదని, ప్రస్తుతం పార్టీ మారినప్పటి నుంచి ప్రజలకు తనేంటో అర్థమైందని అన్నారు. సమావేశంలో గంగుల వెంకటరత్న ప్రసాద్, నర్రా కృష్ణ, చావలి వెంకట్, మరకా గోపికృష్ణ, మరకా శంకర్, పిన్నిబోయిన అంజయ్య, మరకా శీను (లైలా), గంగుల మీరయ్య, నర్రా పోలిరాజు, కన్నేటి రాజా, శీను పాల్గొన్నారు.


వైసిపిలో చేరిన ఎస్‌సి నాయకులు

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెంలోని వైసీపీ కార్యాలయంలో సంతమాగులూరు ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు 25కుటుంబాలు ఎస్సీ కాలనీ నాయకులు తొట్టెంపూడి ఏసుదాసు, జువ్విగుంట రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో వైసీపీ మండల పరిశీలకులు కైపు మహేష్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో బుధవారం చేరారు. వారికి మహేష్ రెడ్డి వైసిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ నాయకులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలపట్ల ఆకర్షితులై వైసీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెరుగుమల్లి చంద్రయ్య, అల్లడి పోలేరు, అల్లడి సామేలు, గుర్రాల మోజేస్, దారా శ్రీనివాసరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ విప్పల ముసలారెడ్డి, ఓరుగంటి కోటిరెడ్డి, గుర్రం ఏడుకొండలు, నాలి రామారావు పాల్గొన్నారు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సాయిబాబా

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

టిడిపి ఎన్నికల ప్రచారంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఇంటింటికి తిరిగి టిడిపి ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ప్రజలకు వివిరస్తూ కరపత్రాలు పంచారు. రాష్ట్రంలో అభివృద్ధి గాడి తప్పిందని అన్నారు. దానిని సరిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో సంక్షేమ పథకాలతో నడిపించడానికి చంద్రబాబును ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వై కరుణా శ్రీనివాసరావు, ఎడ్ల జయశీలరావు, కనపర్తి సుందర్రావు, ఆదిన బసవపున్నయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి యడం బాలాజీ

సిఎం పర్యటనపై సమీక్ష

ప్రజాశక్తి - పర్చూరు

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా మాజీ ఎంపిపి కోటా హరిప్రసాద్ నివాసంలో వైసీపీ ఎంఎల్‌ఎ అభ్యర్థి యడం బాలాజీ, వైసిపి మాజీ ఇంచార్జి రావి రామనాధం బాబు నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 6, 7తేదీల్లో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర పర్చూరు నియోజకవర్గంలో జరుగనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను చర్చించారు. ఎండల తీవ్రత కారణంగా యాత్రకు వచ్చే ప్రజలకు సౌకర్యాల ఏర్పాట్లు చర్చించారు. కార్యక్రమంలో నాయకులు యద్దనపూడి హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, నరిశెట్టి విపిన్ బాబు, కఠారి అప్పారావు, దాసరి వెంకట్రావ్, గాదె సురేష్, కొనకంచి సుబ్బారావు, లంకా శివ, ఆకుల హేమంత్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్ధారు ప్రమీల

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల కారణంగా గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తహశీల్దారు ఎం ప్రమీల సూచించారు. గ్రామ రెవెన్యూ అధికారులతో తన కార్యాలములో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రజలు అందరు కూడా అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎఎస్ఓ జె పుష్పలత, విఆర్‌ఓలు పాల్గొన్నారు.



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహశీల్ధారు ప్రమీల

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని గంగవరం సచివాలయంలో స్వీప్ ప్రోగ్రాం బుధివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు ఎం ప్రమీల మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఏప్రిల్ 15వరకు కొత్తగా ఓటు నమోదు కొరకు అవకాశం ఉందని తెలిపారు. వృద్ధులు, వికలాంగ ఓటర్లకు ఇంటి వద్దనే ఓటు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డిటి విజయ భాస్కరరెడ్డి, ఏఎస్ఓ జె పుష్పలత, విఆర్ఓ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలో ఓటు హక్కు అవగాహన సదస్సు స్వీప్ నోడల్ ఆఫీసర్, డిఆర్డిఎ పిడి వై పిచ్చిరెడ్డి, నోడల్ ఆఫీసర్, పిడబ్ల్యుడి గుణశీల, ఎంపీడీఒ శ్రీనివాసరెడ్డి, ఎన్జీఒ ప్రెసిడెంట్ వెంకన్న బాబు మాట్లాడారు. వికలాంగులు, వృద్ధులు ఎలా ఓటు హక్కు వినియోగించుకోవాలనే వివరాలు తెలిపారు. వారితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

పిల్లి హజరత్తయ్యకు జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం

ప్రజాశక్తి -శింగరాయకొండ



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (భారతీయ భాషా సంస్థ), విద్యా మంత్రిత్వ శాఖ మరియు ఉన్నత విద్యాశాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ఉగాది కవి సమ్మేళానికి తనకు ఆహ్వానంఅందినట్లు ప్రముఖ కవి, పాకల జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య తెలిపారు. ఈమేరకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు మాడభూషి సంపత్ కుమార్ నుంచి ఆహ్వాన పత్రాన్ని అందుకున్నారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సమావేశ మందిరంలో ఈనెల 5న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న కవి సమ్మేళనంలో తాను పాల్గొనున్నట్లు హజరత్తయ్య తెలిపారు. ప్రసిద్ధ కవులు పాల్గొనే కవి సమ్మేళనంలో తనకు పాల్గొనే అవకాశం రావడం ఎంతో ఆనందని ఉందని తెలిపారు. తెలుగుభాషకు సేవ చేస్తూ తెలుగు వికాసాన్ని కషి చేస్తున్న పి.హజరత్తయ్యకు ప్రసిద్ధ కవుల సరసన చోటు లభించడం పట్ల సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు అభినందనలు తెలిపారు.



శీలం రామును పరామర్శిస్తున్న మంత్రి సురేష్

శీలం రాముకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి -శింగరాయకొండ

వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శీలం రాము అనారోగ్య కారణాల దృష్ట్యా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమరాజుపల్లిలోని రాము ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదురుపడిన వెంటనే వైసిపి అభ్యర్థుల గెలుపు కోసం కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.సలీమ్ బాషా, ముళ్ళపూడి సత్యనారాయణ, పఠాన్ రియాజ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి కామేపల్లి , పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1,073 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 778 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల 295 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.233, అత్యల్ప ధర రూ.220, సరాసరి ధర కిలో రూ.228.70 పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. వేలంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులు తెలియజేయండి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలు -2024 సందర్భంగా ఒంగోలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఎన్నికల ఫిర్యాదులను తెలియజేయాలని సెంటర్ ఇన్‌ఛార్జి వరకుమార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ 24 గంటలు పనిచేసేలా 08592- 288599 టెలిఫోన్ నంబర్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు / ఓటర్లు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను పై టెలిఫోన్ నెంబర్‌కు తెలియజేయాలన్నారు.

నామినేషన్ వేసే అభ్యర్థులకు

నిబంధనలపై అవగాహన ఉండాలి : రంజిత్ బాషా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

సాధారణ ఎన్నికలలో నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18 నుంచి 25 వరకూ కొనసాగుతుందన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు అయినందున ఎస్‌సి అభ్యర్థుల నామినేషన్లను మాత్రమే స్వీకరిస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలలో వేమూరు నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు అయినందున ఎస్‌సి అభ్యర్థుల నామినేషన్లను మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఎస్‌సి రిజర్వు అభ్యర్థులు 50 శాతమే డిపాజిట్‌గా చెల్లించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ జరుగుతుందన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులను సాయంత్రం మూడు గంటలలోపు ఆర్‌ఓ కార్యాలయంలో ఉంటే అనుమతిస్తామన్నారు. నామినేషన్ సమయంలో ఆర్‌ఓ కార్యాలయం వద్ద సీసీ కెమెరాలు, వీడియోల నిఘా ఉంటుందన్నారు. ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని అభ్యర్థులు పూరించాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థి పేరు ఓటర్ జాబితాలో ఉండాలన్నారు. ఫామ్-26 కింద అఫిడవిట్ సమర్పించాలన్నారు. మూడు నెలల క్రితం తీసిన ఫొటోలతో నాలుగు సెట్ల నామినేషన్ వేయవచ్చన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతిపాదించే అభ్యర్థులు ఫాం-ఎ, ఫాం-బి లను జతపరచాలన్నారు. కొత్త బ్యాంకు ఖాతా తెరిచిన తరువాత, ఆ ఖాతానే వినియోగించాలన్నారు. అభ్యర్థిపై క్రిమినల్ కేసులు నమోదై, అవి పెండింగ్ లో ఉండడం, లేదా శిక్ష పడి ఉంటే అలాంటి వాటిపై టీవీ ఛానల్స్, పత్రికలలో ప్రచురించాల్సి ఉందన్నారు. నామినేషన్ ప్రక్రియ తరువాత అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.రవి, బిజెపి నాయకుడు కెవి.రామకష్ణ, సిపిఎం నాయకులు ఎం.కోటేశ్వరరావు, బిఎస్‌పి నాయకుడు కె.కోటేశ్వరరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు ఎ.బాలాజీరెడ్డి, వైసిపి నాయకులు ఐ.మాల్యాద్రి, టిడిపి నాయకులు షేక్ మహమ్మద్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లిస్తాం

డిఎం,హెచ్‌ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న డిఎం,హెచ్‌ఒ డాక్టర్ రాజ్యలక్ష్మి

ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి తెలిపారు. ఒంగోలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో ఆశా గ్రీవెన్స్, రిడ్రెసెల్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి. కల్పన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలను సకాలంలో పరిష్కరించేందుకు డిడిఒలకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. డిఎం,హెచ్‌ఒ మాట్లాడుతూ ఆశాలతో సంబంధం లేని పనులు చేయించరాదనే సర్క్యులర్‌ను పిహెచ్‌సిలకు పంపిస్తామన్నారు. హెల్త్ క్లినిక్, సచివాలయాలు, సబ్ సెంటర్‌కి ఆశా వర్కర్స్ రావాల్సిన అవసరం లేదన్నారు. ఆశా వర్కర్స్ ఫీల్డ్ వర్క్ చేయాలని, చిమ్మించటం వాటర్ తెప్పించడం వంటి పనులు చేయించరాదని సర్క్యులర్ పంపిస్తామన్నారు. ఒఐఇ ట్రైనింగ్‌కి డబ్బులు రాని పిహెచ్‌సిలకు వెంటనే చెల్లించాలన్నారు. ఫోన్ మరమ్మతులో ఉంటే వాటిని వెనక్కి ఇచ్చి కొత్త వాటిని తీసుకోవాలన్నారు. ఖాళీలు ఉన్న ఆశావర్కర్స్ పోస్టులు, నాణ్యతో కూడిన యూనిఫారం ఇవ్వటానికి అంగీకరించారు. లైంగిక వేధింపుల నిరోధక కంప్లైంట్ కమిటీలు ప్రతి పిహెచ్‌సిలో ఏర్పాటు చేస్తామన్నారు. రికార్డ్స్ సెలవులు, మెడికల్ లీవులు వీటికి సంబంధించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు ఈ సమావేశంలో డిపిఎంఒ డాక్టర్ వాణిశ్రీ, ఎఒ, డిపిహెచ్‌ఎన్‌ఒ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి అనూష, ఆఫీస్ బేరర్ పరిశుద్ధం, అరుంధతి. దేవదానం. పద్మ. విజయ దేవదానం సుకన్య పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం : గౌస్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బిఆర్ గౌస్

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బిఆర్.గౌస్ తెలిపారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా బిఆర్ గౌస్‌కు సీటు కేటాయించారు. ఈ సందర్భంగా డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం గౌస్ మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి, వైసిపిలు ప్రజా సంక్షేమాన్ని మరచి పరిపాలన కొనసాగించారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు.టిడిపి, వైఎస్‌పిలు సైతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వైఫల్యం చెందాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా తనను ప్రకటించిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దాసరి రవి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు ఉంగరాల శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు ఎస్‌కె.రసూల్, నబీక్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24 నుంచి సదస్సులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జాతీయ పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 24 నుంచి 26 వరకూ ఒంగోలులో సదస్సులు నిర్వహించ నున్నట్లు సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు,నేషనల్ లోకల్ గవర్నమెంట్ ఛాంబర్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి. వీరభద్రాచారి తెలిపారు. సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు అత్యంత చేరువగా ఉండే ప్రజాప్రతినిధి వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ అని తెలిపారు. బల్వంతరాయ్ మెహతా రూపొందించిన పంచాయతీరాజ్ వ్యవస్థ నేడు స్థానిక సంస్థల రూపంలో స్థానిక ప్రభుత్వాలు పంచాయతీ, మండల పరిషత్, జిల్లాపరిషత్, మున్సిపల్, నగరపాలక సంస్థలు గా పాలన సాగిస్తున్న తీరు అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సులలో పంచాయతీరాజ్ ప్రముఖులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. జడ్‌పి ఛైర్‌పర్సన్, ఎంపిక చేసిన పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు సర్పంచి, ఎంపిటిసి, జడ్‌పిటిసి, కౌన్సిలర్స్, కార్పొరేటర్లకు సేవా పురస్కారాలు అందజేస్తామని వీర భద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రసాదరావు, మోహనరావు, సీతామహాలక్ష్మి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

పోలీసు కవాతు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలతో సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఆకతాయిలు, చెడు నడత కలిగిన వ్యక్తులు సంచరించడానికి అవకాశం ఉన్న ప్రదేశాల లోనూ కవాతు నిర్వహిస్తున్నారు. మద్యం, నగదు, ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి అవకాశం వున్న ఇతర వస్తువులు అక్రమ రవాణాను అరికట్టడానికి నివాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా తగిన భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా సమస్యాత్మక గ్రామాలలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు.కొన్ని గ్రామాల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో కూడా సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను కట్టడి చేయడానికి వాహన తనిఖీలను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. బాపట్ల రూరల్ ఎస్‌ఐ ఆధ్వర్యంలో పిట్టువారి పాలెం గ్రామంలో, చిన్నగంజాం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఆధ్వర్యంలో వారి స్టేషన్ పరిధిలోని చింత గుంపల్లి గ్రామంలో, మేదరమెట్ల ఎస్‌ఐ ఆధ్వర్యంలో వారి స్టేషన్ పరిధిలోని బొడ్డువారిపాలెం గ్రామాలలో సాయుధ బలగాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, ఎన్నికలు నియమావళి అతిక్రమించిన, ప్రజలను ప్రలోభాలకు గురిచేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు.